సాక్షి అనంతపురం

ఆదివారం। 4। మే। 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు, కనిష్టం రూ.4 వేలు, సరాసరి రూ.14 వేలు పలికాయి.



ఒత్తిడి అనంతం

ఉద్యాన శాఖలో ఉద్యోగులు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. నిత్యం సమావేశాలు, నివేదికలు, పర్యటనలతో ఊపిరి సలపలేనంత పని ఉంటోంది. IIలో

గరిష్టం/కనిష్టం

40.7°/22.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపు బీకేఎస్‌లో పరిష్కార వేదిక



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుక్కరాయసముద్రం సమీపంలోని షిరిడీసాయి కళ్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తనతో పాటు జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ, జిల్లా అధికారులందరూ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలని సూచించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెచ్చిపోయిన జేసీ

- సీపీఎం నేత రాంభూపాల్‌పై అనుచిత వ్యాఖ్యలు

తాడిపత్రిటౌన్ : తాడిపత్రి మునిసిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి రెచ్చిపోయారు. సీపీఎం రాష్ట్ర నేత రాంభూపాల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తన అభిప్రాయాన్ని చెప్పడమే నేరమన్నట్లుగా మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఉన్నా జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారు. ఈ అంశంపై 'సాక్షి' టీవీ డిబేట్‌లో రాంభూపాల్ మాట్లాడడాన్ని జేసీ ప్రభాకర్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయారు. శనివారం తాడిపత్రిలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి ..తనదైన రీతిలో రెచ్చిపోయారు. 'స్కూల్ గ్రౌండ్‌లో టిప్పర్లతో రాళ్లు వేశామని మాట్లాడుతున్నావ్.. మాజీ ఎమ్మెల్యేను ఎందుకు వెనుకేసుకొస్తున్నావ్? ఏమైనా మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నావా? గత ఐదేళ్లు ఎక్కడికి పోయింటివి రాంభూపాల్.. ఆరోజు నన్ను పోలీసోళ్లు ముసలోడినని కూడా చూడకుండా ఎలా తోశారో చూడలేదా? నాకు నీ మీద మంచి అభిప్రాయం ఉండేది. ఈ రోజుతో నీకు మర్యాద పోయింది. నీ గురించి కూడా తీస్తా. విత్ రికార్డ్‌తో వస్తా' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు.

రైతుల ఆశలు గాలికి

- గాలీవానకు రూ.2 కోట్లకు పైగా పంట నష్టం

అనంతపురం అగ్రికల్చర్: రైతుల ఆశలు గాలికి పోతున్నాయి. ఈ సీజన్‌లో నెలన్నర రోజులుగా గాలీవాన బీభత్సానికి పెద్ద ఎత్తున వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయి. చేతికొచ్చిన పంటల వల్ల రైతులకు అపార నష్టం వాటిల్లుతోంది. తాజాగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పలు మండలాల్లో 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో పంటలు నేలవాలాయి. గాలులకు తోడుగా ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం వల్ల రైతులకు కోలుకోని నష్టం కలిగించింది. ఉద్యానశాఖ అంచనా మేరకు గుంతకల్లు, గుమ్మఘట్ట, అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల, యల్లనూరు మండలాల్లో 31 గ్రామాల పరిధిలో అరటి, బొప్పాయి, మామిడి పంటలు 88.61 హెక్టార్లలో దెబ్బతినడంతో 102 మంది రైతులకు రూ.1.64 కోట్ల వరకు నష్టం జరిగింది. అలాగే శింగనమల మండలంలో మొక్కజొన్న, వరి పంటలు 44 హెక్టార్లలో నేలవాలడంతో 77 మంది రైతులకు రూ.38 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నెలన్నర రోజులుగా జిల్లా రైతులకు రూ.70 కోట్లకు పైగా పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు.

23 మండలాల్లో వర్షం..

శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 23 మండలాల పరిధిలో 6.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం: సెల్‌ఫోన్‌ను పక్కనపెట్టి చదువుపై శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మున్నానగర్‌కు చెందిన కల్లూరు చంద్రకాంత్ (20) ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చంద్రకాంత్ కళాశాలకు వెళ్లకుండా తరచూ సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. చదువుపై శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన చంద్రకాంత్ శనివారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి కల్లూరు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పక్షి జాతులు పదిలం



- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 145 పక్షి జాతులు
- రాష్ట్రంలో అత్యధిక పక్షిజాతులున్న జిల్లాల్లో రెండో స్థానం
- 147 పక్షి జాతులతో మొదటి స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా
- ద గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్ సర్వేలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యాన పంటలకే కాదు పశుపక్ష్యాదులకూ అలవాలమని తేలింది. ఇప్పటికే జింకల వృద్ధిలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది. చిరుత పులుల సంతతి పెరుగుదలలోనూ అంతే స్థాయిలో ఉంది. తాజాగా పక్షి జాతుల విషయంలోనూ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడి చిట్టడవులు, గుట్టలు, నీటికుంటలు, చెరువులు వంటివి కొన్ని రకాల పక్షులకు అత్యంత ఇష్టంగా ఉన్నట్టు తేలింది. జీబీబీసీ (ద గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్) సర్వేలో ఈ విషయాలు తేలాయి.

145 జాతులు అనంతపురంలోనే..

తాజాగా జీబీబీసీ దేశవ్యాప్తంగా పక్షిజాతుల సమూహాలపై సర్వే చేసింది. 1,084 పక్షి జాతులు ఉన్నట్టు తేల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, తిరుపతి, మంత్రాలయం, హిందూపురం, శింగనమల వంటి ప్రాంతాల్లో ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 245 పక్షి జాతులు ఉన్నట్టు తేల్చగా.. అందులో 145 పక్షిజాతులు అనంతపురంలో ఉన్నాయని తేల్చారు. హిందూపురం ప్రాంతంలో స్వదేశీ పక్షులతో పాటు ఏటా విదేశీ పక్షులు కూడా వచ్చి సంతానం వృద్ధి చేసుకుని వెళుతున్నట్టు గుర్తించారు. పక్షి జాతుల హాట్‌స్పాట్‌గా తిరుపతి సమీపంలోని ఏర్పేడును గుర్తించారు.

వాతావరణ పరిస్థితులే కారణం..

అనంతపురం జిల్లాలో ఎక్కువ పక్షిజాతులు ఉండటానికి కారణం ఇక్కడి వాతావరణ పరిస్థితులేనని జీబీబీసీ చేసిన డాక్యుమెంటులో పొందుపరిచారు. వేసవిలో మూడు మాసాలు మినహా మిగతా రోజుల్లో సమశీతోష్ణస్థితి పరిస్థితులు ఉంటున్నాయి. గడిచిన పదేళ్లుగా నీటి లభ్యత కూడా కావాల్సినంత ఉండటంతో పక్షుల సంతానం ఏటికేటికీ పెరుగుతూ ఉందని గుర్తించారు. హనీ బజార్డ్, వైట్ బెల్లీడ్, సీ ఈగల్, ఎజైల్ ఫాల్కన్, పెరెగ్రైన్ వంటి జాతులు రాష్ట్రంలో బాగా ఉన్నట్టు సర్వేలో తేలింది.

తాజా సర్వేలో పక్షిజాతుల సంఖ్య...	
జిల్లా	పక్షి జాతుల సంఖ్య
చిత్తూరు	169
అనంతపురం	145
విశాఖపట్నం	139
తూర్పుగోదావరి	108
వైఎస్సార్ జిల్లా	106
విజయనగరం	84
పశ్చిమగోదావరి	84

భారీగా పెరుగుతున్న జింకలు.. చిరుతలు

అనంతపురం జిల్లాలో ఇటీవలి కాలంలో బట్టమేక జింకలు, చిరుత పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పెనుకొండ, మడకశిర, కదిరి ప్రాంతాల్లో జింకల సంతతి ఎక్కువైంది. చిరుత పులుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. ఎలుగుబంట్లు, నక్కలు తమ సంతానాన్ని వృద్ధి చేసుకుంటుండగా, తోడేళ్ల సంఖ్య మాత్రం గణనీయంగా తగ్గినట్టు అటవీ శాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

రైతు ఉసురు తీసిన అప్పులు



మృతుడు సబావత్ సామునాయక్

వజ్రకరూరు: అప్పులు ఓ గిరిజన రైతు ఉసురు తీశాయి. వెంకటాంపల్లి పెద్దతండా (రూప్లానాయక్ తండా)లో శనివారం సబావత్ సాము నాయక్ (44) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబావత్ సాము నాయక్‌కు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో ఏడుదాకా బోర్లు వేయించాడు. బోర్ల ద్వారా వచ్చే నీటి ఆధారంగా మూడేళ్లుగా మిరప సాగు చేస్తున్నాడు. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ పెట్టాడు. అయితే పంటలు ఆశించిన స్థాయిలో చేతికి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. పంటల సాగు, బోర్ల కోసం చేసిన అప్పులు రూ.16లక్షలకు చేరుకున్నాయి. వీటిని ఎలా తీర్చాలో అర్థం కాక రోజూ మదనపడుతుండేవాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సబావత్ సామునాయక్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం పనులు ముగించుకుని వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తట్టగా ఎంతకూ తీయలేదు. అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా సామునాయక్ ఉరికి వేలాడుతూ కనిపించడంతో గట్టిగా కేకలు వేశారు. దేవుడా ఇక తమకు దిక్కెవరు అంటూ కుటుంబ సభ్యులు రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. వజ్రకరూరు ఎస్‌ఐ నాగస్వామి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. రైతు సామునాయక్‌కు భార్య సామక్కబాయి, నలుగురు కుమారులు ఉన్నారు. ఎంపీపీ రమావత్ దేవి, సర్పంచ్ కొర్రా శివాజీ నాయక్ తదితరులు ఆస్పత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇళ్ల స్థలాల్లో ఇంత పెద్ద గుంతలా?

- ఎర్రకొండలో అక్రమ తవ్వకాలు
- పరిశీలనలో అధికారుల విస్మయం
- హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యంపై భూగర్భ గనుల డీడీ ఆగ్రహం



ఎర్రకొండలో అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న భూగర్భ గనుల శాఖ డీడీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఇతర సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్నకాలనీ పక్కన ఉన్న ఎర్రకొండ చుట్టూ అక్రమ తవ్వకాలను చూసిన అధికారులు నివ్వెరపోయారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు, చివరకు కరెంటు పోళ్లు, నీటి ట్యాంకుల చుట్టూ పెద్దపెద్ద గుంతల కారణంగా ప్రమాదకరంగా మారిన దృశ్యాలను చూసి విస్మయం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎర్రకొండ చుట్టూ యథేచ్ఛగా తవ్వకాలు జరిపిన వైనంపై 'సాక్షి'లో శుక్రవారం 'ఎర్రకొండపై ఎల్లో గద్దలు' శీర్షికతో వచ్చిన కథనం కలకలం రేపింది. ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. భూగర్భ గనుల శాఖ డీడీ గంజి వెంకటేశ్వర్లు, అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్, ఆర్‌ఐ సందీప్, సర్వేయర్ రఘునాథ్ తదితరులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పేదలకు ఇళ్ల కోసం కేటాయించిన స్థలాల్లోనూ పది అడుగులకు పైగా గుంతలు పెట్టడాన్ని తీవ్రంగా పరిగణించారు. తవ్వకాలతో ప్రమాదకరంగా మారిన కరెంటు పోళ్లు, నీటిట్యాంకులు వర్షాకాలంలో కూలే ప్రమాదం ఉందని తేల్చారు. హౌసింగ్ పీడీ శైలజకు గనుల శాఖ డీడీ వెంకటేశ్వర్లు ఫోన్‌లో మాట్లాడారు. మీరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన ప్రాంతంలో ఇంత పెద్ద ఎత్తున గుంతలు పెట్టినా చర్యలు ఎందుకు తీసుకోలేదని అడగగా... అదంతా రెవెన్యూ వాళ్లు చూసుకోవాలి కదా అని పీడీ పేర్కొన్నారు. రెవెన్యూ వాళ్లు స్థలాన్ని హౌసింగ్ అధికారులకు అప్పగించారు. హౌసింగ్ వారే ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారు. కరెంటు పోళ్లు నాటించారు. నీటి ట్యాంకులు ఏర్పాటు చేయించారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ను పర్యవేక్షించకుండా ఇలా గాలికొదిలేస్తే ఎలా అని డీడీ ప్రశ్నించారు. కచ్చితంగా ఒకరిద్దరిని ఇక్కడ ఏర్పాటు చేసి తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. వెంటనే ఇద్దరు ఉద్యోగులను ఏర్పాటు చేస్తామని హౌసింగ్ పీడీ పేర్కొన్నారు. వీఆర్‌ఏ కూడా రోజూ వచ్చి ఈ ప్రాంతాన్ని పరిశీలించాలని, ఎవరైనా తవ్వకాలు జరిపినా, జేసీబీలు, హిటాచీలు, టిప్పర్లు ఈ ప్రాంతానికి వచ్చినా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా తవ్వకాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

లింగ నిర్ధారణ తీవ్ర నేరం

అనంతపురం అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్రమైన నేరమని, ఎప్పటికప్పుడు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం, ఏఆర్‌టీ సరోగసీ చట్టానికి సంబంధించి డిస్ట్రిక్ లెవల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం కింద ఫిర్యాదుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంబంధించి పోస్టర్లను తయారు చేయాలని ఆదేశించారు. బాలికల కళాశాలల వద్ద బీట్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. టీనేజీ ప్రెగ్నెన్సీ నమోదైన వెంటనే హెల్త్, ఐసీడీఎస్ అధికారులు ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. లింగ నిర్ధారణకు అడ్డుకట్టవేయాలన్నారు. ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలకు జరకూడదని, చట్టం అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఒకటవ ఏడీజే సత్యవాణి, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, డాక్టర్ పార్వతి, ఆర్డీడీ ప్రతినిధి డాక్టర్ దుర్గేష్, డీఎస్పీ మహబూబ్‌బాషా, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్, ఆశారాణి, రెడ్స్ భానూజా డెమో త్యాగరాజ్, హెల్త్ ఎడ్యుకేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

లక్ష్యాలను పూర్తి చేయాలి..

సచివాలయాల పరిధిలో చేపట్టిన మనమిత్ర క్యాంపెయిన్, తదితర కార్యక్రమాలకు సంబంధించి లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయాలు, ఇతర అంశాలపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీఓలు, డీఎల్‌డీఓలు ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ప్రజారోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమిత్రకు సంబంధించి రోజుకు 17 వేల క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. సిటిజన్ ఈ–కేవైసీ రోజుకు 10 వేలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజు నాయుడు, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్, ఎన్‌టీఆర్ వైద్యసేవ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పీజీఆర్‌ఎస్ తహసీల్దారు వాణిశ్రీ, జీఎస్‌డబ్ల్యూఎస్ కో–ఆర్డినేటర్ ధనుంజయ పాల్గొన్నారు.

గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజున అభ్యర్థుల హాజరు 65 శాతం

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 9వ తేదీ నాటికి పరీక్షలు ముగుస్తాయి. తొలి రోజున అభ్యర్థుల హాజరు 65 శాతం నమోదయ్యింది. అనంతపురంలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ బాలజీ పీజీ కళాశాల కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 594 మంది అభ్యర్థులకు గాను 389 మంది హాజరయ్యారు. 205 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాట్లు, మౌలిక సదుపాయల కల్పనపై ఆరా తీశారు. వేసవి దృష్ట్యా తాగునీటి సదుపాయంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఏపీఎస్సీ నియమ, నిబంధనలు కచ్చితంగా అమలు కావాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, లైజన్ అధికారి ఎస్‌డీసీ తిప్పేనాయక్, తహసీల్దార్ హరికుమార్ ఉన్నారు.



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

హతవిధీ.. రక్తం ఏదీ..?

- సర్వజనాస్పత్రిలో రక్తం కొరత
- రోజువారి అవసరం 50 యూనిట్లు
- రక్తనిధిలో అందుబాటులో ఉన్నది 163 యూనిట్లే



ఇక్కడ కనిపిస్తున్న గర్భిణి యాడికి చెందిన మహిళ. హెచ్‌బీ 8లోపే ఉండడంతో గైనిక్ వైద్యులు రెండు యూనిట్ల రక్తం ఎక్కించాల్సి వచ్చింది. 2 గ్రాములు, 4 గ్రాములు, తదితర తక్కువ శాతంతో హెచ్‌బీ ఉన్న వారు చాలామంది ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్నారు.

- రాయదుర్గం ప్రాంతానికి చెందిన భంభం స్వామికి పొట్టేలు పొడవడంతో కాలుకు తీవ్ర రక్తస్రావమై శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఇప్పటి వరకు భంభం స్వామికి 10 యూనిట్ల రక్తం ఎక్కించారు.
- అదేవిధంగా హిందూపురానికి చెందిన ఓ మహిళ గైనిక్ సమస్యతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. వైద్యులు రక్తం ఎక్కించుకోవాలని సూచించారు. అయితే ఆమెకు డోనర్ ఎవరూ లేరు. చివరకు బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు డోనర్ లేకున్నా..రక్తాన్ని అందించేలా చర్యలు తీసుకున్నారు.



అనంతపురం సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రం

అనంతపుం మెడికల్: ఉమ్మడి జిల్లాకు అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రే పెద్ద దిక్కు. నలుమూలల నుంచి రోగులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఇక్కడ అవసరాలకు తగ్గట్టుగా రక్త నిల్వలు లేకపోవడం కలవర పెడుతోంది. రోజూ 2,500 మంది ఔట్ పేషంట్, 1,100 మంది ఇన్‌పేషంట్లు సేవలు పొందుతుంటారు. వివిధ వార్డుల్లో ఉన్న రోగులకు సరాసరి 50 మంది వరకు రక్తం అవసరం ఉంటుంది. అందులో గర్భిణులు, బాలింతలు 20 మందికిపైగానే ఉంటున్నారు.

అందుబాటులో 163 యూనిట్లు

ప్రస్తుతం సర్వజనాస్పత్రి రక్తనిధి కేంద్రంలో 163 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉంది. అందులో ఏ పాజిటివ్ 22, బీ పాజిటివ్ 16, ఓ పాజిటివ్ 27, ఏబీ పాజిటివ్ 4, ఏ నెగిటివ్ 1, బీ నెగిటివ్ 7, ఓ నెగిటివ్ 7, ఏబీ నెగిటివ్ 1, ఇంకా ఇన్వెస్టిగేషన్ చేయాల్సినవి 78 యూనిట్లు ఉన్నాయి.

సదుపాయాలు మృగ్యం..

సర్వజనాస్పత్రిలో రక్తనిధి (బ్లడ్ బ్యాంకు) నిర్వహణను ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రక్తనిధి కేంద్రంలో 12 ఏసీలు ఉన్నాయి. ఇందులో రెండు మాత్రమే పని చేస్తున్నాయి. ఇక రక్తం నిల్వ ఉంచే ఫ్రీజర్ చెడిపోయి చాలా రోజులైంది. దీనిని మరమ్మతు చేయించి.. రక్తం నిల్వలు పెంచడానికి చర్యలు చేపట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రోగుల ప్రాణాలంటే లెక్కలేదని తెలుస్తోంది.

మంత్రికి ప్రైవేట్‌పైనే ప్రీతి..

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈ ఏడాది తన జన్మదినం రోజున ప్రభుత్వ సర్వజనాస్పత్రి రక్తనిధి కేంద్రానికి మెడికల్ క్యాంపునకు అవకాశం కల్పించారు. అయితే రోజుల వ్యవధిలోనే క్యాంపును నగరంలోని దీపు రక్తనిధికి మళ్లించారు. ఎక్కడైనా సర్వజనాస్పత్రికి అధిక యూనిట్ల రక్తం అందించేలా చూడాల్సిన మంత్రి వర్యులు.. ఇలా ప్రైవేట్ రక్తనిధికి సహకరించడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

కన్నెత్తి చూడని కలెక్టర్..

కలెక్టర్ వినోద్‌కుమార్ ఏనాడూ సర్వజనాస్పత్రి రక్తనిధి కేంద్రం వైపు కన్నెత్తి చూడలేదు. పాతూరులోని రెడ్‌క్రాస్‌ను నాలుగైదు సార్లు పరిశీలించి, వారిని పొగడ్తలతో ముంచెత్తారు. కానీ ఏనాడూ సర్వజనాస్పత్రి రక్తనిధి కేంద్రాన్ని అభివృద్ధి చేసి.. అధిక మొత్తంలో రక్తం అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. యువత ముందుచూపుతో రక్తం అందించడానికి ముందు వస్తే గర్భిణులు, బాలింతలు, క్షతగాత్రులకు ఉపయోగపడుతుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు)కు సంబంధించి 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ హర్షేనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 3వ తరగతికి 40 సీట్లున్నాయని, వీటిలో ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ–2, ఓసీ 1 సీటు చొప్పున కేటాయించామని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్‌కు సంబంధించి 4వ తరగతిలో 32, 5వ తరగతికి 30, 6వ తరగతి 10, 7వ తరగతి 4, 8వ తరగతి 3, 9వ తరగతిలో 12, సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలియజేశారు. వీటిని డీటీడబ్ల్యూఓ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామని, ఆసక్తి ఉన్న వారు ఈనెల20లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తిని రక్షించబోయి..

- దావణగెరె జిల్లాలో అనంతవాసి మృతి

దొడ్డబళ్లాపురం: కాలువలో మునుగుతున్న యువకుడిని రక్షించబోయి ఇద్దరు నీట మునిగి మరణించారు. ఈ దుర్ఘటన కర్ణాటకలో దావణగెరె తాలూకా కుర్కి గ్రామంలో చోటుచేసుకుంది. రామకృష్ణ ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురానికి చెందిన కే.రామకృష్ణ(34) దావణగెరెలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం గ్రామం సమీపంలోని తుంగభద్ర కాలువలో ఈత కొట్టడానికి బంధువు హిమేశ్ (21)ను తీసుకుని వెళ్లాడు. ఇంతలో ఎవరో ఒక యువకుడు కాలువలో మునిగిపోతున్నానని కేకలు వేశాడు. అతనిని రక్షించాలని రామకృష్ణ, హిమేశ్ కూడా కాలువలోకి దూకారు. అయితే నీటి తాకిడికి ఈత కొట్టలేక నీట మునిగి మరణించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించి రామకృష్ణ, హిమేశ్ మృతదేహాలను వెలికితీశారు. హదడి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఒత్తిడి అనంతం

- అనారోగ్యం బారిన అధికారులు, ఉద్యోగులు
- డిప్యుటేషన్‌లో డీడీ, సెలవులో ఏడీ, హెచ్‌ఓలపై భారం
- అధికార పార్టీ, కమిషనరేట్, కలెక్టరేట్ ఒత్తిళ్లతో అనారోగ్యం





ఉద్యానశాఖ కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానశాఖ అధికారులు ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. రైతులు, పంట రకాలు, విస్తీర్ణం, దిగుబడులు, టర్నోవర్ పరంగా 'అనంత' అగ్రస్థానంలో కొనసాగుతోంది. 72 రకాల పంటలతో ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగానూ, ఫలసాయం, ఎగుమతుల పరంగా ఇటీవల ఉద్యాన హబ్‌గా పిలవబడుతోంది. జిల్లాలో 3 లక్షల ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉద్యాన తోటలు విస్తరించాయి. అందులో 1.80 లక్షల ఎకరాలు పండ్లతోటలు, 55 వేల ఎకరాల్లో కూరగాయ పంటలు, మిగతా 45 వేల ఎకరాల్లో పూలు, ఔషధ, సుగంధ, తోట పంటలు సాగులో ఉన్నట్లు ఈ–క్రాప్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వీటి ద్వారా ఏటా 38 లక్షల మెట్రిక్ టన్నుల ఫలసాయం వస్తుండగా... రూ.10 వేల నుంచి రూ.12 వేల కోట్ల మేర టర్నోవర్ (జీవీఏ) ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. 'అనంత' ఫలసాయానికి ఢిల్లీలో ఉన్న అజాద్‌పూర్ మండీతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటోంది. అలాగే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ, నాగపూర్ లాంటి మార్కెట్లకు చీనీ, దానిమ్మ, మామిడి, అరటి, టమాట, కళింగర, కర్బూజా లాంటి ఫలసాయం ఎగుమతి అవుతోంది.

ఏడీ స్థాయి అధికారే దిక్కు..

ఉద్యానతోటల పరంగా ప్రాధాన్యత కలిగిన 'అనంత'కు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ (డీడీహెచ్) స్థాయి అధికారి లేకపోవడం గమనార్హం. ఇక్కడే వేతనం తీసుకుంటూ బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజు నుంచి కమిషనరేట్‌లో డిప్యుటేషన్ మీద పనిచేస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) స్థాయి అధికారితో నెట్టుకొస్తున్నారు. ఏడీకి అదనంగా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈఓగా బాధ్యతలు ఇచ్చారు. ఇక 31 మండలాల పరిధిలో 10 మంది హార్టికల్చర్ ఆఫీసర్లు(హెచ్‌ఓ)లు, మరో నలుగురు హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు(హెచ్‌ఈఓ) ఉన్నారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లుగా మరో 180 మంది వరకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ (వీహెచ్‌ఏ)లు పనిచేస్తున్నా. వీరు పూర్తి స్థాయిలో హార్టికల్చర్ కింద పనిచేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం నిర్దేశించిన ఉద్యాన పథకాలతో పాటు ఏపీఎంఐపీ కింద అమలు చేస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్ల పథకంలో కూడా ఉద్యానశాఖ అధికారులు భాగస్వామ్యం వహించాల్సి ఉంటుంది. దీంతో ఉద్యానశాఖ మీద పనిఒత్తిడి పెరిగినట్లు చెబుతున్నారు.

నిత్యం సమావేశాలే..

తరచూ కమిషనరేట్, కలెక్టరేట్ నుంచి నివేదికలు కోరడం, నిత్యం జూమ్, వెబ్ కాన్ఫరెన్స్‌లు, టెలీ కాన్ఫరెన్స్‌లు అధికం కావడం, క్యాంప్‌లు ఉండటం తదితర కారణాలతో ఒత్తిడి అధికమవుతున్నట్లు తెలుస్తోంది. అలాగే అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లవాన, చీడపీడల తాకిడికి పంటలు దెబ్బతినడం, సస్యరక్షణ సిఫారసులు చేయడం, పంట నష్టం అంచనా వేయడం లాంటి వాటితో పాటు ఇటీవల కాలంలో పథకాల అమలులో అధికార పార్టీ నుంచి ఒత్తిళ్లు పెరగడం వల్ల ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో ఆ శాఖ అధికారులు అనారోగ్యం పాలవుతున్నట్లు తెలుస్తోంది. ఏడీ స్థాయి అధికారి నరసింహారావు రెండు సార్లు నెల రోజుల పాటు సెలవు పెట్టారు. ప్రధానంగా గంట గంటకు పై నుంచి నివేదికలు, సమాచారం అడగడం వల్ల సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా గత నెలలో ఈదురుగాలులతో పంటలు దెబ్బతిన్న సమయంలో పుట్లూరు మండలానికి చెందిన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడటంతో అధికార పార్టీ నేతలు, కమిషనరేట్, కలెక్టరేట్ నుంచి ఒత్తిళ్లు రావడంతో ఏడీ నరసింహారావు గుండెనొప్పితో ఆసుపత్రిలో చికిత్స తీసుకుని అనంతరం నెల రోజుల పాటు సెలవు పెట్టారు. అలాగే హెచ్‌ఓ రత్నకుమార్ సైతం గుండెనొప్పితో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. కార్యాలయ సూపరిండెండెంట్ బాషా సైతం గుండెనొప్పితో ఇటీవల స్టంట్ వేయించుకున్నారు. మరో సూపరిండెండెంట్ శాంతకుమారి తీవ్ర వెన్నునొప్పితో ఆపరేషన్ చేయించుకున్నారు. అకౌంటెంట్ కమలాకర్ కంటి నొప్పి భరించలేక వారం కింద లేజర్ ఆపరేషన్ చేయించుకున్నారు. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఒకరు తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఇలా... ఉద్యానశాఖ అధికారులు, ఉద్యోగులు ఇటీవల ఒత్తిడికి గురవుతున్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

నల్లలమ్మ ఆలయంలో చోరీ

రాప్తాడు: బుక్కచెర్ల ఎస్సీ కాలనీలోని నల్లలమ్మ ఆలయంలో అమ్మవారి సొత్తులు చోరీకి గురయ్యాయి. ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు తెలిపిన వివరాలు.. ఆలయ పూజారి నల్లప్ప అమ్మవారికి ప్రతి మంగళ, శుక్ర, ఆదివారం పూజలు చేస్తుండేవారు. శుక్రవారం పూజలు చేసి ఆలయానికి తలుపులు వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి 80 గ్రాముల అమ్మవారి ముఖావళి, 20 గ్రాముల 3 వెండి గొడుగులు, ఒక తులం బంగారు తాళిబొట్టును ఎత్తుకెళ్లారు. రూ.2 లక్షల విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

ఆర్టీసీ బస్సులో రూ. 70 వేల చోరీ

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో ఉన్న ప్రయాణికుడి నుంచి రూ.70 వేలు చోరీకి గురయ్యాయి. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన తాయప్ప రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని స్వస్థతశాలకు వచ్చాడు. శనివారం సాయంత్రం రాయచూరు వెళ్లడానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాడు. ఈక్రమంలో ఆళ్లగడ్డ బస్సు ఎక్కగా పది నిమిషాల్లోనే తన వద్ద ఉన్న రూ.70 వేలు కనిపించలేదు. దీంతో బస్సంతా వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బస్సును స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై దాడి



గాయపడిన మునాఫ్

అనంతపురం: మద్యం మత్తులో స్నేహితుడిపై దాడిపై దాడి చేసిన ఘటన శారదనగర్‌లో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ వి. రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన వివరాలు..ఫెర్రర్ నగర్‌కు చెందిన మునాఫ్, శారదానగర్‌కు చెందిన మురళి మిత్రులు. మద్యం సేవించిన అనంతరం మాటామాట పెరిగింది. వ్యక్తిగతంగా దూషించుకున్నారు. స్థానికులు సర్దిచెప్పి పంపించేశారు. దూషించాడనే అవమానంతో దూషించిన మురళి నాటు కొడవలి, దుస్తులు శుభ్రం చేసే సోడా రసాయన ద్రావణం, తీసుకుని తిరిగి మద్యం షాపు వద్దకు వచ్చాడు. శారదనగర్‌లో మద్యం షాపు వద్ద మద్యం సేవిస్తున్న మునాఫ్‌పై ద్రావణం చల్లాడు. రాయి, కొడవలితో దాడికి యత్నించాడు. స్థానికులు అడ్డుకోవడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడ్డ మునాఫ్‌ను ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. బాధితుడి కళ్లు, ముఖం, శరీర భాగాలు దెబ్బన్నాయని, మెరుగైన చికిత్స అవసరమని డాక్టర్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు మురళిని అదుపులోకి తీసుకున్నారు.

అప్పుల భూమి అమరావతి

- ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ

అనంతపురం కల్చరల్: పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన అమరావతి పుణ్యభూమి ఎలా అవుతుందని ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు ప్రశ్నించారు. ఈమేరకు వారు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీలంకను తలపిస్తూ రూ.లక్షల కోట్ల అప్పులు చేసి తిప్పలు పడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అన్ని రంగాలు వెనక్కు పోతుంటే ప్రధాని మోదీ ఎలా పొగుడుతారని ప్రశ్నించారు. స్థిరాస్తిని కొనాలంటే మిగులు డబ్బులుండాలన్న కామన్‌సెన్స్ లేకుండా అప్పు చేసి నిర్మిస్తామనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కూటమిలో ఉన్నంత మాత్రాన ఇక్కడి వారిని పొగడ్తల్లో ముంచెత్తిన ప్రధాని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి ఒక్క మాట మాట్లాకపోవడం విచారకరమని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ లాంటి మేధావులు అధికార వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యన్నారని, కానీ కేంద్రీకరణ కోసం అప్పులు చేయించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అమరావతి పేరిట దుబారా చేయకుండా అసెంబ్లీ, హైకోర్టు, అధికారుల నివాసాల నిర్మించి మిగిలిన డబ్బుతో అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి జరిగేట్టు చూడాలని, వికేంద్రీకరణ ఉద్యమాలు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

నిజానిజాల్ని ప్రజలకు వివరిద్దాం

- వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ గ్లోబల్ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి
- మెల్‌బోర్న్‌లో ప్రవాసాంధ్రులతో సమావేశం



మెల్‌బోర్న్‌లో ప్రవాసాంధ్రులతో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం మెడికల్: ప్రత్యక్ష రాజకీయ వేదికల కంటే సామాజిక మాధ్యమాల ద్వారా నిజం గళం వివరించి ప్రజలను చైతన్యవంతులను చేద్దామని వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం గ్లోబల్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మెల్‌బోర్న్‌లో జరిగిన వైఎస్సార్ సీపీ గ్లోబల్ కనెక్ట్ కార్యక్రమం విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు పథకాలు అందించడం ద్వారా సంక్షేమ విప్లవాన్ని సృష్టించారన్నారు. విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చడమే కాకుండా అన్ని వర్గాల వారికి ఖరీదైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పాలనలోనూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాయాలను తీసుకువచ్చి ఒకేసారి 1,25,000 మందికి ఉద్యోగాలు, 2.6 లక్షల మంది వలంటీర్లకు ఉపాధి కల్పించారన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని విధంగా విప్లవాత్మక సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. ఇంటి వద్దకే పాలననందించారన్నారు. అబద్దాలకు గళం ఇస్తే మనం వాస్తవాలకు శబ్దం ఇవ్వాలని, డేటా, గణాంకాలు, గ్రాఫులు ఇవేన ఆయుధాలని, జగనన్నను సీఎం చేసుకోవడానికి ప్రవాసాంధ్రులు పోరాట పటిమను చాటాలన్నారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా వైఎస్సార్ సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, మెల్‌బోర్న్ కన్వీనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా ఉద్యోగమేళా

రిజిస్ట్రేషన్ కోసం క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సోమవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి. పద్మశ్రీ, జేకేసీ సమన్వయకర్త తాళంకి జీవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలు డాక్టర్ రెడ్డి ఫౌండేషన్, కియా, అమెజాన్, జోయలుక్కాస్ తదితర సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆయా కంపెనీల్లో సుమారు 1000 పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తయిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

- డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్‌కు గాయాలు



గాయపడ్డ డీటీ ఇంతియాజ్

కనగానపల్లి: మండల పరిధిలోని మామిళ్లపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్‌బాషాతో కలిసి శనివారం ఉదయం అనంతపురం నుంచి పెనుగొండ వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో బెంగళూరు నుంచి అనంతపురం వైపు వస్తున్న మరో కారు రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని ఇటువైపు వెళ్తున్న వీరి కారును ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీటీ ఇంతియాజ్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ అన్వర్‌బాషా గాయపడ్డారు. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని మర్తాడుకు చెందిన ఓ వృద్ధురాలు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సైదాబీ(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంది. అయినా ఫలితం లేకపోవడంతో మదనపడుతుండేది. ఈక్రమంలో అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుత్తి డీవైఈఓగా పాటిల్ మల్లారెడ్డి

- ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి చెక్ పెట్టిన ఉన్నతాధికారులు



డీవైఈఓ మల్లారెడ్డిని సన్మానిస్తున్న గుత్తి డివిజన్ హెచ్‌ఎం అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్/ గుత్తి: గత కొంత కాలంగా నాన్చుతూ వచ్చిన గుత్తి డీవైఈఓ పోస్టుపై ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చారు. బెళుగుప్ప ఎంఈఓ పాటిల్ మల్లారెడ్డి(ఎఫ్ఏసీ)ని నియమిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు 4 రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ రెగ్యులర్ డీవైఈఓగా పని చేస్తున్న శ్రీదేవి ఫిబ్రవరి 28న రిటైర్డ్ అయ్యారు. అప్పటి నుంచి డీఈఓనే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. నూతన డీవైఈఓ మల్లారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా విద్యాశాఖలోని ఓ విభాగంలో కీలకమైన పోస్టులో పని చేసిన అధికారిపై ఆర్థిక అంశాలపై ఆరోపణలు వచ్చాయి. గతంతో పని చేసిన డీఈఓ వరలక్ష్మి... ఇక్కడ చేరకముందే ఆమె పేరుతో ప్రశ్నపత్రాల ముద్రణకు ఆర్డర్ ఇవ్వడం, ఆ తర్వాత బిల్లులు డ్రా చేయడం తదితర అంశాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. విచారణ నివేదిక ఆధారంగా సదరు అధికారిపై చార్జ్ మెమోలు జారీ చేశారు. వాస్తవానికి ఈ అధికారే సీనియార్టీ జాబితాలో ముందున్నారు. అయితే చార్జెస్ పెండింగ్ ఉన్న కారణంగా...ఆయనకు ఇవ్వడానికి వీలులేదని తేల్చిన ఉన్నతాధికారులు మల్లారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి కోసం విద్యాశాఖలోని మరో కీలక అధికారి చివరివరకు తీవ్రంగా చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

తాగునీటి ట్యాంకుల శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సంప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు, వైద్యాధికారిణి డాక్టర్ వినీత

ఉరవకొండ: ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని తాగునీటి సంప్ శుక్రవారం అధికారులు శుభ్రం చేయించారు. 'తగ్గని వాంతులు..విరేచనాలు' శీర్షికతో సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మేజర్ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి క్లోరినేషన్ చేపట్టారు. ఉరవకొండ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌వీఆర్ చౌదరి ఆదేశాల మేరకు వైద్యాధికారిణి డాక్టర్ వీనీత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు ఐజయ్య, ద్రాక్షయణితో కలిసి స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని సంప్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా జేఈ ఐజయ్య మాట్లాడుతూ నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లను మరమ్మతు చేయడంతో పాటు కొత్తగా మైక్రో ఫిల్టర్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. గ్రామాల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ రవిప్రసాద్ గ్రామకార్యదర్శులను ఆదేశించారు.

బంగారం మూట మాయం అతడి పనే..

- పెన్నహోబిలం ఘటనలో స్వీపరే నిందితుడు
- సీసీ పుటేజీ ఆధారంగా గుర్తింపు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామికి భక్తురాలు సమర్పించిన బంగారు మూటను మాయం చేసిందే స్వీపరేనని పోలీసులు గుర్తించారు. శనివారం అర్బన్ సీఐ మహానంది వివరాలు వెల్లడించారు. మార్చి 7న ఆమిద్యాల గ్రామానికి చెందిన వనజాక్షి అనే భక్తురాలు మొక్కులో భాగంగా నిలువుదోపిడీ కింద బంగారు మూటను స్వామి వారికి సమర్పించింది.ఈఏడాది మార్చి 18న పెన్నహోబిళం శ్రీవారి హుండీ లెక్కింపు సమయంలో స్వీపర్ శ్రీనివాసులు వనజాక్షి సమర్పించిన బంగారు మూటను ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టి మూట కనబడలేదని అధికారులను తప్పుదోవ పెట్టించాడు. వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లడంతో భయపడిన స్వీపర్ తాను చెత్త ఊడుస్తున్న సమయంలో బంగారు మూట దొరికిందని చెప్పి అధికారులు అప్పగించారు. అయితే ఈ ఘటనపై ఈఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆలయంలో సీసీటీవీ పుటేజీలను పరిశీలించగా స్వీపర్ బంగారు మూటను మాయం చేసేందుకు యత్నించినట్లు నిర్ధారణ అయింది. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చెక్కలు మీదపడి వాచ్‌మన్ మృతి

రాప్తాడురూరల్: నిర్మాణ ఇంటిలో ఉంచిన చెక్కలు ప్రమాదవశాత్తూ మీద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని బాలాజీ విల్లాస్ సమీపంలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..సుధాకర్ అనే వ్యక్తి కళ్యాణదుర్గం రోడ్డు బాలాజీ విల్లాస్ సమీపంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. సిద్దు అనే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాడు. ఇక్కడ వాచ్‌మన్‌గా చంద్రబాబుకొట్టాలకు చెందిన చాకలి శంకరనారాయణ(40) ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి వర్షం కురుస్తుండడంతో నిర్మాణం జరుగుతున్న ఇంటిలోని ఓ గదిలో నిద్రపోయాడు. డోర్ కోసం తెచ్చిన చెక్కలు ప్రమాదవశాత్తూ ఆయన మీద మీదపడ్డాయి. తీవ్రంగా గాయపడిన మృతి చెందాడు. మృతుడికి భార్య జయంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

కల్యాణం .. కమనీయం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. శుద్ధ షష్ఠి సందర్భంగా శనివారం ఆలయంలో వివిధ పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రాచ్ఛారణల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భిక్షాటనతో నిరసన



సర్వజనాస్పత్రి ముందు భిక్షాటన చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీలు) శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట భిక్షాటన చేశారు. ఎంఎల్‌హెచ్‌పీల ఆందోళనకు ఏఐటీయూసీ, ఏపీ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్, ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 433 ఆయుష్మాన్ భారత్ మందిర్ ద్వారా ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేవారన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు సమ్మె లోకి వెళ్లడంతో ఆ సేవలకు బ్రేక్ పడిందన్నారు. కానీ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఆరేళ్లు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులరైజేషన్ చేయడంతో పాటు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో పాటు 23 శాతం వేతనాలు పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీధర్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీల అసోసియేషన్ నాయకులు గౌరి, వినోద్, అనూష, తదితరులు పాల్గొన్నారు.

బండిశుల రథోత్సవం జయప్రదం చేయండి



గ్రామదేవతలు సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలు

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ నిర్వహించనున్న గ్రామ దేవతలు సుంకులమ్మ, ముత్యాలయ్య బండిశుల రథోత్సవాన్ని జయప్రదం చేయాలని సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి శనివారం కోరారు. రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి–అనంతపురం మీదుగా బండిశుల రథోత్సవం ఉంటుందన్నారు.

టీ తాగుతూ.. తిరిగిరానిలోకాలకు



మృతుడు సాయినాథ్

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో శుక్రవారం రాత్రి ఓ హోటల్లో సాయినాథ్(34) అనే వ్యక్తి టీ తాగుతున్న సమయంలో కుప్పకూలి కిందపడి మృతి చెందాడు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సాయినాథ్ తన స్నేహితులతో కలిసి టీ తాగడానికి హోటల్‌కు వెళ్లాడు. అక్కడ టీ తాగుతున్న సమయంలో ఉన్న ఫళంగా కుప్పకూలి కింద పడ్డాడు. వెంటనే స్నేహితులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సాయినాథ్ మృతి చెందినట్లు నిర్ధారించారు.

విశ్రాంత ఉద్యోగి హఠాన్మరణం



రంగన్న(ఫైల్)

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని బండిమోటు వీధికి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు జింకా రంగన్న(68) శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. గుండె పోటుతో మృతి చెంది ఉండవచ్చని వైద్యులు తెలిపారు. జింకా రంగన్న మృతిపై బలిజ సంఘం నాయకుల సంతాపం ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మదన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

పామిడి: మండలంలోని ఖాదర్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎన్. మదన్‌మోహన్‌రెడ్డి(59) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతిపై మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.భీమ్‌రెడ్డి తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

రోడ్లన్నీ ఛిద్రం



జడ్జి బంగ్లా ముందర డ్రిల్లింగ్ చేస్తూ రోడ్డును తవ్వుతున్న దృశ్యం



పెద్ద గుంత పెట్టాక ఇలా...



గ్యాస్ పైపులైన్ కోసం గుంతలు తవ్వుతున్న దృశ్యం



అరవిందనగర్‌లో గుంత తవ్వి.. వదిలేశారిలా..

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పలు చోట్ల రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ గ్యాస్ పైపులైనును ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం నగరపాలక సంస్థ నుంచి తీసుకున్న అనుమతులకు మించి రోడ్లను తవ్వేస్తోంది. అరవిందనగర్‌లో బీటీ రోడ్డు, నాయక్‌నగర్‌లో సీసీ రోడ్లను పైపులైను కోసం ఛిద్రం చేసేసింది. తాజాగా జడ్జి బంగ్లా వద్ద పెద్ద ఎత్తున రోడ్డుపై తవ్వారు. డ్రిల్లింగ్ మిషన్‌తో సీసీ రోడ్డును గుంతలు పెట్టే సమయంలో చుట్టూ అదురుతోంది. ఈ క్రమంలో చుట్టుపక్కల రోడ్డు పటిష్టత దెబ్బ తింటోంది. పనులు జరిగే సమయంలో నగర పాలక సంస్థ ఈఈలు, డీఈలు, ఏఈలు అటు వైపు తొంగి చూడడం లేదు. రోడ్డు ఎలా తవ్వితే తమకేంటి అన్నట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్యాస్ కంపెనీ ప్రతినిధులు కూలీలతో ఇష్టారాజ్యంగా పనులు చేయిస్తున్నారు. నిబంధనల ప్రకారం తవ్విన ప్రదేశాన్ని తిరిగి పటిష్టవంతంగా ప్యాచ్ వర్క్ చేయాలి. కానీ తవ్విన ప్రాంతంలో తూతూమంత్రంగా మట్టి కప్పేసి వెళ్తున్నారు. నగర నలుమూలలా ఇలానే రంధ్రాలు పెట్టుకుంటూ పోతూ.. సరైన పునఃనిర్మాణ పనులు చేపట్టకపోతే రోడ్డు నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు.

నేడు ఏపీఆర్‌ఎస్‌లో ఇంటర్ ప్రవేశ పరీక్ష

రామగిరి: మండంలోని పేరూరు, నసనకోటలోని ఏపీ ఆర్‌ఎస్ (మహాత్మా జ్యోతిబా పూలే) పాఠశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు అమీనాబేగం, రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. నసనకోటలో 479 మంది, పేరూరుడ్యాంలోని పాఠశాల పరీక్ష కేంద్రంలో 299 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అన్ని సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. నసనకోట పాఠశాలకు కేంద్రానికి చీఫ్‌గా రమాదేవిని, పేరూరు కేంద్రం చీఫ్‌గా మాధవిలతను నియమించినట్లు వారు వెల్లడించారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

అనంతపురం టవర్‌క్లాక్: పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకుందామని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శనివారం ఆయన జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్డీటీకి నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో హరినాథ్ రెడ్డి, సర్ఫున్నీసా, సుధాకర్, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

9న మాతృదేవోభవ కార్యక్రమం

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలోని తపోవనం చిన్మయామిషన్ జగదీశ్వరాలయంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 9న మాతృదేవోభవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం రాప్తాడు మండలం బొమ్మేపర్తిలో గణపతి సచ్చిదానందస్వామీజీ ఆవిష్కరించారు. ట్రస్టు ప్రతినిధి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితానే కొనసాగించాలి

- డీఈఓకు విన్నవించిన ఉపాధ్యాయ సంఘాలు



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలో కొందరు ఉపాధ్యాయులు వ్యక్తిగత స్వార్థం కోసం 'టిస్'లో ఇష్టానుసారంగా సీనియార్టీ నమోదు చేశారని, మునిసిపల్ అధికారుల రికార్డుల మేరకే సీనియార్టీ జాబితాను కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, ఎంఈఓ గురు ప్రసాద్, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డెగావత్ రవీంద్రనాథ్ తదితరులు శనివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. 2004 సెప్టెంబరు 17న అప్పటి కమిషనర్ నగరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల కొరత కారణంగా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ జరిగేదాకా తాత్కాలికంగా ఎస్జీటీలను ఉన్నత పాఠశాలల్లో నియమించారన్నారు. ఆ సమయంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా తాత్కాలిక పదోన్నతులు చేపట్టారని గుర్తు చేశారు. ఈ క్రమంలో తిరిగి వారందరికీ నిబంధనల మేరకు విడతల వారీగా రెగ్యులర్ పదోన్నతులు కల్పించారన్నారు. అయితే కొందరు టీచర్లు ×టిస్‌×లో జాయినింగ్ తేదీలను ఇష్టానుసారంగా నమోదు చేశారన్నారు. దీంతో మరికొందరు సీనియార్టీలో నష్టపోనున్నారన్నారు. మునిసిపల్ అధికారులు రూపొందించిన సీనియార్టీ జాబితా మేరకు వివరాలు పొందుపరిచేలా చూడాలని డీఈఓను కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఉపాధ్యాయులు పీఎం రవీంద్ర, ఆదినారాయణ, లోకయ్య, గాంధీనాయక్, తిరుపాలునాయక్, పుల్లమ్మ, రమాదేవి, సునీత, రాధా, రామాంజులు ఉన్నారు.

భక్తిభావంతోనే ఉత్తమ జీవితం

- మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న గణపతి సచ్చిదానంద స్వామి

రాప్తాడు: భక్తి మార్గం మనిషిని ఉన్నతంగా నడిపిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో భక్తి మార్గంలో నడవాలని మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో నాలుగు రోజులుగా జయలక్ష్మి మాత జయంత్యుత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థులు ఆధ్వర్యంలో జయలక్ష్మి మాతకు శ్రీచక్రార్చన పూజ నిర్వహించారు. సాయంత్రం గణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో జయలక్ష్మి ×రాగ సాగర× కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. సంగీతంతో శరీరంలోని 64 వేల నాడి మండల సమూహం ఉత్తేజమవుతుందని, అందువల్ల మానసిక ప్రశాంతత కోసం, సంపూర్ణ ఆరోగ్యం కోసం సంగీతాన్ని సాధన చేయాలని సూచించారు. ఒడిదుడుకులు, మానసిక ఒత్తిడులు ప్రస్తుతం సర్వసాధారణంగా మారాయని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వాయిద్య పరికరాలను వాయిస్తూ వివిధ రాగాల ద్వారా రోగాలను ఎలా నయం చేయవచ్చు వివరించారు. ట్రస్ట్ నిర్వాహకులు వెంకట నాయుడు, సుజాత, బోయ తిరుపాలు మాట్లాడుతూ.. ఆదివారం ఆశ్రమంలో గణపతి సచ్చిదానందస్వామి చేతుల మీదుగా శ్రీచక్ర పూజ, నరహరితీర్థ వేద విద్యా నిలయం, జయలక్ష్మి మాత వైద్యశాల, అన్నపూర్ణ మందిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

భగవద్గీతలో బంగారు పతకాలు



విశ్వేశ్వరరెడ్డి రామకృష్ణారెడ్డి అనురాధ

అనంతపురం కల్చరల్: హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీగణపతి సచ్చిదానంద భగవద్గీత పారాయణ ట్రస్టు వారు దేశవ్యాప్తంగా గత నెలలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో అనంతపురం వాసులు బంగారు పతకాలకు ఎంపికయ్యారు. జిల్లా నుంచి 78 ఏళ్ల వయసున్న విశ్రాంత అధ్యాపకుడు రామకృష్ణారెడ్డి, 67 ఏళ్ల ఆధ్యాత్మిక సేవాకార్యకర్త అనురాధ, హిందూ చైతన్యవేదిక ద్వారా సామాజిక పోరాటాలు చేస్తున్న 44 ఏళ్ల సీహెచ్ విశ్వేశ్వరరెడ్డి పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం 18 అధ్యాయాలను ఏకబిగిన చెప్పడమే కాకుండా ఏ శ్లోకమడిగినా చెప్పగలిగే పరీక్షల్లో ఉత్తమ శ్రేణిలో నిలిచిన ఈ ముగ్గురూ ఈ నెల 18న మైసూరు ఆశ్రమంలో అవధూత స్వరూపులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సకల సమస్యల పరిష్కారమార్గమైన భగవద్గీతను చిన్నతనం నుంచే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నేర్పించాలని సూచించారు.

ఉద్యోగాల కల్పనలో విఫలం



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం అర్బన్: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని నాయకులు ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నవయుగ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ ముఖ్య అతిథిగా హాజరై ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఆయనతోపాటు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని 2014 ఎన్నికల సమయంలో నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. 2013–14లో నిరుద్యోగం 4.9 శాతం ఉండగా, బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ సమస్య 5 శాతానికి పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో నిరుద్యోగ సమస్యలపై విస్తృతంగా చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళి, దేవా, ఆనంద్, శ్రీనివాస్, సురేంద్ర పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతుకు మేలు

- జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

రాప్తాడు: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు తగ్గట్టుగా పంటలసాగు చేసి ఎరువులు వాడితే తప్పకుండా దిగుబడులు పెరుగుతాయని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శనివారం మండలంలోని మరూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, రైతు సేవా కేంద్రాల పరధిలోని పలువురు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేశారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. పొలం నుంచి సేకరించిన మట్టిని పరీక్షించడం ద్వారా ఏ పంట బాగా పండుతుంది...ఎంత మేర ఎరువులు వాడాలో తెలుస్తుందన్నారు. భూసార పరీక్షల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. అయితే ఎరువులు వేసిన నెల రోజుల వరకూ మట్టి నమూనాలు సేకరించకూడదన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఎల్ శ్రీనాథ్‌రెడ్డి, ఏఓ శ్రీవాణి, ఏఈఓ రంజిత, మరూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు మాచినేని కొండారెడ్డి, సీఈఓ రవి, వీహెచ్ఏ హర్ష, వీఏఏ రవి, గౌస్ బాషా, ఎంపీఈఓ రాజు, నరేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నేడు మానవహారం

అనంతపురం కల్చరల్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద మానవహారం నిర్మిస్తున్నట్లు యునైటెడ్ జేఏసీ నాయకులు తెలిపారు. నగరంలోని తౌహిద్ మసీదులో శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఈద్గా మసీదులో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం మానవహారం నిర్మిస్తామన్నారు. ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో యునైటెడ్ జేఏసీ నాయకులు జాఫర్, దాదాగాంధీ, వసీం, సైఫుల్లాబేగ్, వలి, ముఫ్తి ముదస్సర్, కాగజ్‌ఘర్ రిజ్వాన్, వేముల నదీం తదితరులు పాల్గొన్నారు.

విరేచనాలతో మహిళ మృతి

వైద్యం వికటించి మృతిచెందినట్లు బాధితుల ఆరోపణ

గుమ్మఘట్ట: మండలంలోని జాలివంకకు చెందిన బోయ పార్వతమ్మ (53) విరేచనాలతో శనివారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. పార్వతమ్మ, రాయదుర్గంలోని పైతోటకు చెందిన ఈరబొమ్మన్న దంపతులకు సంతానం కలగలేదు. ఈరబొమ్మన్న రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య పార్వతమ్మ పుట్టింటికి వెళ్లింది. రెండు రోజులుగా వాంతులు, విరేచనాలు అవుతుండడంతో ఆర్‌ఎంపీ (మూస క్లినిక్) ఖలీల్ వద్దకు చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చికిత్స తర్వాత ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే ఆమె మృతి చెందడంతో వైద్యం వికటించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా మార్చి నెలలో గలగల గ్రామానికి చెందిన లక్ష్మి కూడా ఆర్‌ఎంపీ ఖలీల్ వద్దకు చికిత్స చేయించిన తర్వాతనే మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకున్నారు. క్లినిక్‌ను సీజ్ చేశారు. అయితే నెల రోజులు కూడా గడవకనే వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలను ఖాతరు చేస్తూ క్లినిక్ వెనుక భాగంలో గుట్టుగా తెరిచి వైద్యసేవలు అందిస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి పల్లకీ ఉత్సవం



పెన్నహోబిలంలో శ్రీవారి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకీ ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని విశేష పుష్పాలతో అలంకరించిన పల్లకీలో ఉంచి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, అర్చకులు ద్వారకానాథ చార్యులు, బాలాజీ స్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రాయదుర్గంటౌన్: అనంతపురం ప్రధాన రహదారి గుండ్లపల్లి బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోనబావికి చెదిన అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గుమ్మఘట్ట మండలం గోనబావికి చెందిన అశోక్ కళ్యాణదుర్గంలోని ఓ గార్మెంట్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని తిరిగి గ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. గుండ్లపల్లి వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన అశోక్‌ను రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నలుగురిపై కేసు నమోదు

పామిడి: మండలంలోని కత్రిమల గ్రామంలో వడ్డే నల్లప్ప, ఆయన తమ్ముడు వడ్డే రామకృష్ణపై అదే గ్రామవాసులైన శివారెడ్డితో పాటు ఆయన వర్గీయులైన మరో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఇశ్రాయేల్ శనివారం తెలిపారు. వడ్డే నల్లప్ప, శివారెడ్డికి ఇంటిముందు స్థలం, నల్లప్ప ఇంటిముందు మురుగు ప్రవహించటం, చెత్తాచెదారం వేయడంపై ఘర్షణ నెలకొంది. శివారెడ్డి, ఆయన వర్గీయులు దౌర్జన్యంగా వడ్డే నల్లప్ప ఇంట్లోకి దూరి నల్లప్పతో పాటు ఆయన తమ్ముడు వడ్డే రామకృష్ణపై కట్టెలతో దాడి చేశారు. దాడిలో నల్లప్ప, రామకృష్ణ గాయపడ్డారు, క్షతగాత్రుడు రామకృష్ణ అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బచ్చనకల్లేశ్వరస్వామి పట్టాభిషేకం



బచ్చనకల్లేశ్వరస్వామి, వసికేరప్పస్వామి



బచ్చనకల్లేశ్వరస్వామి ఆలయం

కణేకల్లు: కురుబల (తెల్లతుమ్మలగోత్రం) ఇంటి ఇలవేల్పు బచ్చనకల్లేశ్వర స్వామి పట్టాభిషేక మహోత్సవం ఆదివారం జరగనుంది. 25 ఏళ్లకోసారి నిర్వహించనున్న ఈ వేడుకలను ఈఏడాది వైభవంగా జరపడానికి ఆలయ కమిటీతోపాటు కురుబలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆంధ్రా, కర్ణాటక నుంచి సుమారు వంద గ్రామాల్లో ఉంటున్న తెల్ల తుమ్మలగోత్రం వారు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. సుమారు 80 వేల నుంచి 90వేల వరకు జనం తరలిరానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అతి పురాతన స్వామి ఆలయాన్ని కురుబలు రూ.3 కోట్లతో నిర్మించారు. శనివారం బచ్చనకల్లేశ్వరస్వామి, వసికేరప్పస్వామికి పూజలు నిర్వహించారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లుటౌన్/పెద్దపప్పూరు: వేసవి సెలవుల సందర్భంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మస్తాన్‌రావు, రిటైర్డ్ తహసీల్దార్ ఈఓ. రాముడు సూచించారు. శనివారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పిల్లలు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుందన్నారు. అలాగే చిత్రలేఖనం, మ్యాథ్స్‌లో మెలకువలు, ఇండోర్ గేమ్స్ తదితర శిక్షణా శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కమ్మన్న, సిబ్బంది హేమలత, రాము, రిటైర్డ్ టీచర్ గంగరాజు, శాంతపాల్ తదితరులు పాల్గొన్నారు.

- పెద్దపప్పూరు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణలో భాగంగా విద్యార్థులకు వ్యాచ రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శంకర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాలుగు పదుల వయసు దాటిన మహిళల్లో హార్మోన్లలో మార్పులు సహజం. అందుకే పోషకాహారాన్ని ప్లాన్ చేసుకోవడమే కాదు ఆరోగ్యానికి కొన్ని సప్లిమెంట్స్ వాడకం కూడా అవసరమే' అంటూ తన డైట్‌ప్లాన్‌ను వివరించారు బుల్లితెర నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అస్మిత కర్ణని. 'ఇరవై ఏళ్లుగా హెల్తీ డైట్ ప్లాన్ చేసుకున్నందుకే ఈ రోజుకీ హెల్తీగా ఉన్నాను' అని చెబుతున్నారు.

ఫైబర్ ముందు... ప్రొటీన్లు తర్వాత


అస్మిత కర్ణని

'మైండ్ ప్రశాంతంగా ఉండాలంటే బాడీ కూల్‌గా ఉండాలి. నా శరీరానికి ఎలాంటి పోషకాలు అవసరమో తెలుసుకుంటూ, 20 ఏళ్లుగా డైట్ ప్లాన్ చేస్తున్నాను. రోజూ ఉదయం నట్స్, డ్రై ఫ్రూట్స్‌తో రోజును స్టార్ట్ చేస్తాను. వర్కౌట్స్ తర్వాత సలాడ్స్, ఫుడ్ సంప్లిమెంట్స్ తీసుకుంటాను. ఒక పూట భోజనానికే ప్రాముఖ్యత. 40 ఏళ్ల తర్వాత హార్మోన్లలో చాలా వేగంగా మార్పులు వస్తుంటాయి. మన ఆరోగ్యం హార్మోన్ల మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ రోజుల్లో ఆహారపదార్థాల్లో పోషకాలు బాగా తగ్గిపోయాయి. అందుకే నిపుణులు సూచించిన మెడికల్ న్యూట్రిషన్ సప్లిమెంట్స్ తీసుకుంటాను.

బయటి ఫుడ్ తీసుకోను...

లంచ్ టైమ్‌లో ఒక వరస క్రమాన్ని పాటిస్తాను. మొదట కడుపులోకి వెళ్లాల్సింది పీచుపదార్థాలు. అందుకని కూరగాయలతో చేసిన సలాడ్ ముందుగా తీసుకుంటాను. తర్వాత ప్రొటీన్ డైట్, ఆ తర్వాత కార్బోహైడ్రేట్స్ ఉన్న డైట్ తీసుకుంటాను. బయటి ఫుడ్ దాదాపు తీసుకోను.

ఉప్పు... చక్కెర తక్కువ

మన శక్తి స్థాయులు పెరగాలంటే ఉప్పు, పంచదార వాడకం బాగా తగ్గించేయాలి. అలా చేయడం వల్ల ఎనర్జీ ఏ మాత్రం తగ్గదు. సీజనల్ ఫ్రూట్స్‌ని ఎప్పుడూ వదులుకోను. వీటిని అరగంటసేపు నీటిలో నానబెట్టి, తీసుకుంటే రసాయనాల ప్రభావం తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్ సాయంత్రం 4:30 కి తీసుకుంటాను. తర్వాత బ్లాక్ కాఫీ. కాఫీ లేదా టీ పాలతో తీసుకుంటే బరువు పెరుగుతారు. అందుకని బ్లాక్ కాఫీ తీసుకుంటాను. సాయంకాలం ప్రొటీన్లు ఉండే ఆహారం తీసుకుంటాను. దీని వల్ల బరువు 70 కేజీలు ఉన్నా, సన్నగా కనిపిస్తాను. ప్రొటీన్ పౌడర్‌కి, యోగర్ట్, కొన్ని ఫ్రూట్స్ కూడా కలిపి తీసుకుంటాను. సూర్యాస్తమయం తర్వాత ఏదీ తినను. ఏడాది మొత్తం నా డైట్ చార్ట్ ఇలాగే ఉంటుంది.



కండరాల బలానికి...

వేసవిలో డీ హైడ్రేట్ అవకుండా ఉండటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటాను. ఎప్పుడైనా లో ఎనర్జీ అనిపిస్తే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన చల్లని నీళ్లు తీసుకుంటాను. రోజులో 3–4 లీటర్ల నీళ్లు తాగుతాను. జనరల్ ఫిట్‌నెస్ కోసం వారంలో 2–3 సార్లు వర్కౌట్స్ చేస్తాను. దీనివల్ల బరువు కూడా మెయింటెన్ అవుతుంది. వృద్ధాప్యంలో కండరాల బలం కోల్పోకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే వాటికి పని పెట్టాలి. అందుకని వ్యాయామం తప్పనిసరి. అందం గురించి కాదు. ఆరోగ్యంగా ఉండాలనుకోవడం జీవితాంతం చేసే ప్రయాణం. అందుకు నా జీవన శైలిని కూడా ఫిక్స్ చేసుకున్నాను'' అని వివరించారు అస్మిత.

నిర్వహణ: **నిర్మలారెడ్డి**



బరువును తగ్గించే సీజన్

వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతలు శరీరంలోని నీటిని ఆవిరి చేస్తుంటాయి. ఎన్నిసార్లు నీళ్లు తాగినా దాహం తీరదు. ఆకలిగానూ అనిపించదు. అలసట, నీరసంతో రోజంతా చికాకు. ఈ సమస్యలకు పరిష్కారం మన చేతిలోనే ఉందంటున్నారు పోషకాహార నిపుణులు సుజాతా స్టీఫెన్.

'శరీరం త్వరగా డీ–హైడ్రేట్ అయ్యే కాలం ఇది. తినే పదార్థాల ఎంపిక సరిగా లేకపోతే జీర్ణవ్యవస్థ గాడి తప్పుతుంది. ఇలాంటప్పుడు...

- కూరగాయలతో చేసిన సలాడ్స్, సాంబార్, రసం.. వంటివి రెగ్యులర్ డైట్‌లో చేర్చుకోవాలి.
- రెండు గంటలకు ఒకసారి గ్లాసుడు నీళ్లు, వేడి ఎక్కువగా ఉన్నప్పుడు అరగంటకు ఒకసారి నీళ్లు తాగాలి.
- అకస్మాత్తుగా తలనొప్పి, భావోద్వేగాలలో మార్పు, నీరసం, ఇరిటేషన్.. వంటివీ తలెత్తుతుంటాయి. దీనిని సైలెంట్ డీ–హైడ్రేషన్ సమస్యగా గుర్తించి నీళ్లు తాగి, కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి.
- నిమ్మరసం, సబ్జా గింజలతో తయారు చేసుకున్న లస్సీ ఒంటికి మేలు చేస్తుంది. నిమ్మరసంలో షుగర్‌కు బదులు కొద్దిగా ఉప్పు, సోడా కలుపుకొని తాగచ్చు.
- మధుమేహులు ఒకేసారి ఎక్కువ మొత్తం తింటే, శరీరంలో గ్లూకోజ్ లెవల్స్ పెరుగుతాయి. అందుకని టైమ్ ప్రకారం ఏదో ఒకటి మితంగా తినాలి.

గర్భిణులకు ప్రత్యేకం

ఈ కాలం గర్భిణులు ఏ కొంచెం తిన్నా ఆయాసం వస్తుంటుంది. ఇలాంటప్పుడు మసాలా ఉన్న ఆహారం కాకుండా పండ్లు, జ్యూసులు, సలాడ్స్ పైన దృష్టి పెట్టాలి. దీని వల్ల కడుపులో హెవీగా ఉన్నట్టు అనిపించదు. ఆయాసం సమస్య తలెత్తదు.

వయసు పైబడిన వాళ్లు

పగటివేళ ఎండగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉంటేనే మంచిది. తప్పనిసరి అయితే వెంట నీళ్లు, పండ్లు తీసుకెళ్లాలి. డీ హైడ్రేట్ అయితే బీపీ డౌన్ అయ్యి కళ్లు తిరిగి పడిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకని వారి వెంట మరొకరు తోడుండాలి.

రీ హైడ్రేషన్

వేసవిలో యూరిన్ పసుపు రంగులో వస్తుందంటే శరీరంలో నీటిశాతం తగ్గిందని అర్థం. రీ హైడ్రేషన్ కోసం నీళ్లు, నిమ్మరసం సరైన ఎంపిక. ఫ్లేవర్డ్, షుగర్ లెస్ మెడికేటెడ్ ఓఆర్ఎస్‌లను ఎంచుకోవచ్చు.

ఇది మంచి సీజన్

- బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి సీజన్. వేడికి ఎక్కువ ఆహారం తినబుద్ధి కాదు.. పండ్లు, కూరగాయలు, జ్యూస్, నీళ్లు ఎక్కువ తీసుకుంటాం. ఇదంతా లో క్యాలరీ ఫుడ్. దీనివల్ల బరువు సులువుగా తగ్గచ్చు.
- వాకింగ్, జాగింగ్, వ్యాయామాలకు ఉదయం వేళ ఎంచుకోవడమే మంచిది.
- వేసవిలో పార్టీలకు వెళ్లినప్పుడు తినే మసాలా ఫుడ్స్ మరుసటి రోజు కూడా ప్రభావం చూపుతుంది. పడుకునేటప్పుడు మజ్జిగ తాగితే అసౌకర్యం తగ్గుతుంది.

కూల్ సలాడ్

- కీరా, దోస, పుదీనా, కొత్తిమీర, ఉల్లిపాయ, క్యాప్సికమ్ వంటివి సన్నని ముక్కలుగా తరిగి, నిమ్మరసం, ఉప్పు, మిరియాలపొడి కలిపి సలాడ్ తయారు చేసుకోవాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టి, రోజులో రెండు మూడుసార్లు తింటే, తేలికగా అనిపిస్తుంది.
- సొరకాయ జ్యూస్, పుదీనా, కొత్తిమీర షర్బత్‌లు, చట్నీలు, రాగి జావ వంటివి.. ఒంటికి మేలు చేస్తాయి.
- మాంసాహారులు తాజాగా తయారు చేసుకున్నవి, నూనె తక్కువగా ఉపయోగించినవి తీసుకోవాలి.



– సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

'డాబా', 'మిద్దె', 'మేడ'... ఈ మాటలు పిల్లలకు తెలుసో లేదోగానీ వేసవి వస్తే ఊళ్ల నుంచి వచ్చిన కజిన్స్‌తో డాబా మీద చాపలు పరుచుకుని ఆకాశాన్ని చూస్తూ చల్లటి గాలిలో కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవడం పెద్ద లగ్జరీ. అనుబంధాలకు బేస్‌మెంట్. నగరాల్లో సరే... ఊళ్లల్లో కూడా పిల్లలకు ఈ భాగ్యం ఉండటం లేదు. ఒకప్పటి ఈ దేశీయ ఆనవాయితీ కాలక్రమంలో 'స్లీపోవర్'గా మారింది. కాని సిసలైన స్లీపోవర్స్‌ను ఈ వేసవిలో పెద్దలే కలిగించాలి.



డాబా నిద్రలూ కజిన్స్‌తో కబుర్లూ



చుక్కల ఆకాశం. ఆగి ఆగి రివ్వున వీచే గాలి. సాయంత్రం నీళ్లు చల్లి డాబా నేల మీదున్న ఉడుకంతా కడిగిస్తే రాత్రికి వేడి కాస్త నిమ్మళించి ఉంటుంది. ఇంట్లోని ఎక్కడెక్కడివో చాపలు, బొంతలు, దుప్పట్లు, పరుపులు, దిండ్లు పైకి వస్తాయి. పక్కలు ఏర్పాటవుతాయి. టేబుల్ ఫ్యాన్ ఉంటే అది కూడా తోడు నిద్రపోవడానికి వస్తుంది. చెంబులు, వాటర్ బాటిల్స్‌లో నీళ్లు ఒక పక్కగా సిద్ధమవుతాయి. పెద్దవాళ్లు వాళ్ల పాతకబుర్లు చెప్పుకోవడం మొదలుపెడతారు. పిల్లల కోసం వేసిన వరుసలో పిల్లలు ఊరికూరికే నవ్వుతుంటారు. ఏమిటేమిటో మాట్లాడుతుంటారు. 'ఏరా... నిద్రపోరా?' అని పెద్దలు గదిమితే నిద్రపోతారా? వారికి నిద్రే రాదు. ఎందుకంటే అది వేసవి కాలం. అది డాబా మీద పక్క. తోడు ఉన్నది ఇష్టమైన బంధువులు. అన్నయ్యలు, తమ్ముళ్లు, అక్కలు, చెల్లెళ్లు, కజిన్స్... రాక రాక వచ్చారు. రాత్రిని నిద్రలో వృథా చేయరు పిల్లలు. కబుర్లే కబుర్లు చెప్పుకుంటారు.

పాతకాలం దాటి వచ్చిన పెద్దవారిని వేసవి కాలం గురించి అడిగితే వారు ఇష్టంగా చెప్పుకునే జ్ఞాపకం మేడ మీది నిద్రలే. ఎండవల్ల ఇంట్లో ఉబ్బరింత భరించలేక డాబా మీద, బయటి అరుగుల మీద, పెరట్లో, ఆఖరుకు వీధిలో కూడా మంచాలు వేసుకుని వరుసగా కొలువు తీరి పొద్దు పోయేంత వరకూ వేసే బాతాఖానీ తలుచుకుంటారు. పిల్లలుగా ఉండగా ఏం మాట్లాడుకున్నారో గుర్తు ఉండదుగాని అలా నిద్రపోవడంలోని ఆనందం గుర్తు ఉంటుంది.

పుణ్యక్షేత్రాలలో, జాతరలలో, తిరునాళ్లల్లో గుంపుగా నిద్రపోయినప్పుడు ఉత్సాహం వస్తుంది మనిషికి. పిల్లలకైనా అంతే. గుంపుగా కలిసి ఆరుబయలులో పడుకోవడం హుషారు. బంధువుల పిల్లలు వస్తే 'వీళ్లు మనవారు' అనే భావనతో విపరీతమైన దగ్గరితనం ఏర్పడుతుంది ఆ సమయాన. లోలోపల ఉన్న మొహమాటాలు పోయి ఓపెన్ అవుతారు. స్కూలు, పుస్తకాలు, సినిమాలు, ఆటలు, స్నేహితుల పేచీలు, టీచర్లు... ప్రతి విషయం గురించి మాట్లాడుకుంటారు. వయసులో పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు అనేక విషయాలు చెబుతారు. చిన్న పిల్లలు కుతూహలంగా విని తెలుసుకుంటారు. ఈ 'చెప్పడం వినడం' అనేది వేసవి సెలవుల డాబా నిద్రల్లో అద్భుతంగా సాగుతుంది.

> మూసి ఉన్న ఇళ్ల నుంచి, మూసి ఉన్న తరగతి గదుల నుంచి ఆరుబయలుకు వచ్చి స్వేచ్ఛాకాశం కింద నిద్రపోవడం వేసవిలో పిల్లలకు కొత్త అనుభూతిని ఇచ్చి అందాకా అనుభవించిన బోర్‌డమ్‌ను తొలగిస్తుంది. అందుకే నగరాల్లో బాలల సైకియాట్రిస్టులు స్లీపోవర్లను ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పుడు బంధువుల పిల్లలతో వేసవిలో సాగిన సామూహిక నిద్రలు ఇప్పుడు కరువవడంతో కనీసం ఏదో ఒక ఫ్రెండ్ ఇంట్లో పిల్లలంతా ఒక రాత్రి నిద్రపోవడానికి చేరి కబుర్లు చెప్పుకుని వొత్తిడి దూరం చేసుకోమంటున్నారు.

చదవక ముందు పెసలు, చదివాక పిసలు అయినట్టుగా మన దగ్గర వందల సంవత్సరాలుగా ఉన్న పద్ధతి ఇప్పుడు శాస్త్రంగా వినాల్సి వస్తోంది. పిల్లలు ఎన్ని జోకులు వేయగలరో, ఎన్ని మిమిక్రీలు చేయగలరో, ఎన్ని వెక్కిరింతలు లోపల దాచుకుని ఉంటారో, ఎంత అబ్జర్వ్ చేసి ఉంటారో ఇవన్నీ తమ మనుషులతో తమకంటూ సమయం దొరికినప్పుడు బయటకు వెల్లడి చేస్తారు. కజిన్స్‌తో వేసవి నిద్రల్లో ఏముంది అనుకోవచ్చు నేడు. అదొక కౌన్సెలింగ్. అదొక వైద్యం. అదొక డీటాక్సినేషన్. వెన్నెలా చంద్రుడూ అందించే 'ఎస్' విటమిన్. ఎస్ అంటే సంతోషం. వేసవి సంబరం.

హెల్త్



బెడ్ వెట్టింగ్ కట్టడి..!

సాధారణంగా చిన్నారులు నిద్రలో పక్కతడుపుతుంటారు. మూత్రవిసర్జన వ్యవస్థపై అదుపు చేకూరక అలా జరుగుతుంది. అయితే పిల్లలు క్రమంగా మూత్రవిసర్జనపై అదుపు సాధించడం మొదలయ్యాక ఈ సమస్య తగ్గుతుంది. సాధారణంగా ఏడు నుంచి ఎనిమిదేళ్ల వయసు వచ్చేనాటికి పిల్లలు తమ మూత్ర విసర్జన కండరాలూ, వ్యవస్థపై అదుపు సాధించాక ఈ సమస్య పూర్తిగా తగ్గుతుంది. ఇలా పక్కతడిపే ఈ సమస్యను వైద్యపరిభాషలో 'నాక్టర్నల్ ఎన్యురిసిస్' అంటారు. అయితే కాస్త అరుదుగానైనా పెద్దపిల్లలతో పాటు కొందరు పెద్దల్లో కూడా ఈ సమస్య ఉండవచ్చు. ఈ సమస్య ఎందుకు వస్తుంది, దాన్ని అధిగమించడమెలా అనే అంశాలను తెలిపేదే ఈ కథనం.

ఒక నిర్వచనాన్ని బట్టి చెప్పాలంటే... ఐదేళ్లకు పైబడిన పిల్లలు వారంలో రెండుసార్లు పక్కతడుపుతుంటే దాన్ని బెడ్ వెట్టింగ్‌గా చెప్పవచ్చు.

ఇదీ విస్తృతి...

బెడ్ వెట్టింగ్ సమస్య వేర్వేరు వయసుల వాళ్లలో వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు...

- **చిన్నపిల్లల్లో:** ఐదేళ్ల పిల్లల్లో దాదాపు సుమారు 15–20% మందిలో నాక్టర్నల్ ఎన్యూరిసిస్ కనిపిస్తుంది. అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిల్లో ఈ సమస్య కాస్త ఎక్కువ.
- **కాస్తంత పెద్ద పిల్లల్లో:** పిల్లలకు ఏడేళ్లు వచ్చే నాటికి 15% – 20% ఉన్న దీని విస్తృతి దాదాపు 10 శాతానికి తగ్గుతుంది.
- **కౌమార బాలల్లో (అడాలసెంట్ పిల్లల్లో):** 13–18 ఏళ్ల పిల్లల్లో ఇది 1 – 3 శాతం వరకు ఉంటుంది.
- **పెద్దలలో:** కొందరు పెద్ద వయసువారిలోనూ ఈ సమస్య కనిపించవచ్చు. అయితే వాళ్లలో ఇది పిల్లల్లో కంటే కాస్త భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు పిల్లల్లో కనిపించే పక్క తడిపే సమస్యను ప్రైమరీ అన్యురిసిస్ అంటారు. అయితే పెద్దల్లో ఇదే సమస్య కనిపించే దాన్ని సెకండరీ నాక్టర్నల్ ఎన్యురిసిస్‌గా చెబుతారు. పెద్దవయసు వాళ్లలోని కనీసం 1 – 2 శాతం వ్యక్తుల్లో ఈ నాక్టర్నల్ ఎన్యురిసిస్ కనిపిస్తుందని అంచనా. ఇలా పెద్దల్లో ఈ సమస్య రావడానికి ఇతరత్రా కారణాలు ఉండవచ్చు. కాబట్టి దీన్ని సెకండరీ అన్యురిసిస్‌గా చెబుతారు.

కారణాలు...

- **ప్రైమరీ ఎన్యురిసిస్‌లో :** పిల్లలకు నిద్రలో తమ మూత్ర విసర్జన వ్యవస్థపై నియంత్రణ లేకపోవడమన్నది మామూలు కారణం. దీనికి ఇతరత్రా ఏవైద్య కారణాలూ ఉండవు.
- **జన్యుపరమైనవి :** కుటుంబాల్లోని వారికి తమ బాల్యంలో ఈ సమస్య ఉంటే పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తుంది.
- **గాఢనిద్ర కారణంగా :** బ్లాడర్ నిండినట్లుగా అందే సూచనలను తమ గాఢనిద్ర కారణంగా వాళ్లు స్వీకరించలేకపోవడం.
- మూత్రాశయం చిన్నగా ఉండటంతో నిల్వ సామర్థ్యం తగ్గడం.
- **సెకండరీ ఎన్యురిసిస్ :** చిన్నారుల్లోగానీ, అలాగే పెద్దవాళ్లలోనూ ముందుగా కొంతకాలంపాటు పక్క తడిపే అలవాటు లేకుండా... అకస్మాత్తుగా కనిపించడం. ఉదాహరణకు పక్కతడిపే అలవాటు మానేశాక కనీసం ఆర్నెల్ల పాటు పక్కలో మూత్రవిసర్జన చేయకుండా... ఆ తర్వాత ఆ ధోరణి కనిపించడాన్ని 'సెకండరీ అన్యురిసిస్'గా చెప్పవచ్చు. ఇందుకు అనేక అంశాలు కారణం కావచ్చు. అవి...
- **ఒత్తిడి లేదా భావోద్వేగ సమస్యలు :** పిల్లల్లో ఆందోళన, బడిలో ఏవైనా తీవ్రమైన ఒత్తిళ్లు ఉండటం. మూత్ర వ్యవస్థలో ఎక్కడైనా ఇన్ఫెక్షన్లు (యూరినరీ ఇన్ఫెక్షన్స్)
- మలబద్ధకం లేదా పేగు సమస్యలు.
- స్లీప్ ఆప్నియా (గురక రావడం) లేదా ఇతరత్రా నిద్ర సంబంధ ఆరోగ్య సమస్యలు.
- డయాబెటిస్ లేదా ఇతరత్రా హార్మోన్ల అసమతౌల్యతల (ఉదా... యాంటీ డై-యూరెటిక్ హార్మోన్ లోపం).

> **తల్లిదండ్రులకు సూచన...**
> ఇది చాలా సాధారణమైన పిల్లల్లో సహజంగా కనిపించే అలవాటు. ఇలా చేసినప్పుడు పిల్లలను కోప్పడటం లేదా వారిని శిక్షించడం సరికాదు. దీనివల్ల మరింత ఒత్తిడి పెరగడం, సమస్య ఇంకాస్త తీవ్రం కావడం జరుగుతుంది. ఇది చాలా తాత్కాలికమైన సమస్య అనీ, దీని గురించి ఆందోళన అవసరం లేదంటూ పిల్లల్లో మానసిక స్థైర్యం కలిగించడం వల్ల ఈ సమస్య వీలైనంత త్వరగా తగ్గుతుంది.

సమస్య నిర్ధారణ ఇలా...

- రాత్రివేళల్లో మూత్రవిసర్జన వల్ల సమస్య స్పష్టంగా తెలుస్తుంది.
- బాధిత చిన్నారులను శారీరకంగా పరిశీలించడం. మెడికల్ హిస్టరీని డాక్టరుకు వివరించడంతో కొన్ని రకాల మూత్ర పరీక్షలు అవసరమవుతాయి.
- **మూత్ర విసర్జన వివరాలతో డైరీ :** పిల్లలు నీళ్లు ఏయే వేళల్లో తాగుతున్నారు, మూత్రవిసర్జన ఎప్పుడెప్పుడు చేస్తున్నారు వంటి విషయాలను నమోదు చేస్తూ ఓ డైరీ రాయడం.
- **శారీరక పరీక్ష:** మూత్ర నాళం, వెన్నెముక, నాడీ వ్యవస్థలో ఏవైనా లోపాలున్నాయా అని పరీక్షించడం.
- **యూరిన్ అనాలసిస్ :** మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్లుగానీ, డయాబెటిస్ లేదా కిడ్నీ సమస్యలేమైనా ఉన్నాయా అని పరీక్షించడం. అవి లేనప్పుడు వాటిని రూల్ అవుట్ చేసుకోవడం.
- **అల్ట్రాసౌండ్ పరీక్ష :** మూత్ర వ్యవస్థ, యూరినరీ బ్లాడర్, మూత్రపిండాల వివరాలను తెలుసుకోవడానికి ఉపయోగపడే పరీక్ష ఇది.
- **అదనపు పరీక్షలు:** ప్రైమరీ అన్యురిసిస్ కాకుండా ఇతరత్రా ఏవైనా కారణలు ఉండవచ్చునని అనుమానించినప్పుడు హార్మోన్ల మోతాదులు, స్లీప్ ఆప్నియా వంటి అంశాల నిర్ధారణ కోసం చేయాల్సిన స్లీప్ స్టడీస్ వంటి పరీక్షలు.


డా. మధు మోహన్ రెడ్డి,
సీనియర్ కన్సల్టెంట్
పీడియాట్రిక్ సర్జన్

నివారణ ఇలా...

ప్రాథమిక కారణాలు తెలిసినప్పుడు వాటిని నివారించడానికి ప్రయత్నించడం. ఉదాహరణకు పిల్లల్లో తీవ్రమైన ఒత్తిడి కారణంగా ఇలా జరుగుతుందని తెలిసినప్పుడు తల్లిదండ్రులు కౌన్సెలింగ్ ద్వారా ఆ ఒత్తిడిని, ఆందోళనను తగ్గించడం.

- **మూత్ర విసర్జన శిక్షణ (టాయిలెట్ ట్రైనింగ్) :** పిల్లలు నిద్రకు ఉపక్రమించే ముందర ఒకసారి మూత్రవిసర్జన చేయించి, మళ్లీ రెండు గంటల తర్వాత నిద్రలేపి మరో మారు మూత్రవిసర్జన చేయించడం లాంటి చర్యల ద్వారా. అలాగే పిల్లల్లో మూత్రాశయ సామర్థ్యాన్ని పెంచడం కోసం రోజూ ఓ నిర్దిష్టమైన వేళల్లో మూత్ర విసర్జన చేసేలా శిక్షణ ఇవ్వడం.
- **ఒత్తిడి దూరం చేయడం :** రాత్రి వేళ పిల్లలు ప్రశాంతంగా నిద్రపోయేలా వారికి ధైర్యం చెప్పడం.
- **ఎన్యూరిసిస్ అలారం ఉపకరణాలతో:** పిల్లలు కొద్దిగా పక్కతడపడం మొదలుపెట్టగానే వాటిని గుర్తించి నిద్రలేపే అలారం ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సహాయంతో పిల్లవాడు నిద్రమేల్కొనేలా శిక్షణ ఇవ్వడం.
- **జీవనశైలి మార్పులు:** సాయంత్రాలు లేదా రాత్రివేళల్లో ద్రవాహారాలు తీసుకోకుండా జాగ్రత్త పడటం. అలాగే నిద్రకు ముందు కాఫీ లేదా కోలా డ్రింక్స్ వంటి పానీయాలు తీసుకోకుండా చూడటం.

మరేవైనా కారణాలతో ఇలా జరుగుతుంటే...

సాధారణ కారణాలు కాకుండా... ఇతర ఆరోగ్యపరమైన అంశాలేవైనా పక్క తడిపేందుకు కారణమవుతుంటే వాటిని గుర్తించి, ఆ సమస్యలకు చికిత్స అందిస్తే పక్కతడిపే అలవాటూ తగ్గుతుంది. ఉదాహరణకు నిద్ర రుగ్మతల కారణంగానో లేదా మానసిక సమస్యల వల్లనో ఇలా జరుగుతుంటే వాటిని గుర్తించి, తగిన చికిత్స అందించడం వల్ల సెకండరీ అన్యురిసిస్ అదుపులోకి వస్తుంది.

ఇక సమస్య పెద్దవాళ్లలో అయితే అది సెకండరీ అన్యురిసిస్ కారణంగా జరుగుతుంది కాబట్టి తగిన పరీక్షల తర్వాత సమస్యను బట్టి వారికి అందించాల్సిన చికిత్స ఉంటుంది.

> **మందులతో నియంత్రణ ఇలా...**
> **డెస్మోప్రెసిన్ :** రాత్రివేళ మూత్రం ఉత్పత్తిని తగ్గించే మందులివి. (వీటిని కృత్రిమంగా ఉత్పత్తి చేసే యాంటీ డై యూరెటిక్ హార్మోన్‌లుగా చెప్పవచ్చు).
> **ఇమిప్రమైన్ (టోఫ్రానిల్):** పిల్లల్లో ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగించే యాంటీ డిప్రెసెంట్ ఔషధాలివి.
> **ఆక్సిబ్యూటినిన్:** మూత్రాశయం ఉండాల్సిన దానికంటే అతి చురుగ్గా ఉన్నప్పుడు దాన్ని నియంత్రించే మందు ఇది.

నోటి క్యాన్సర్ నిర్ధారణ ఇలా!





నోటి పరిశుభ్రత పెద్దగా పాటించకుండా గుట్కా, ఖైనీల రూపంలో పొగాకు నమలడం, ఆల్కహాల్ తీసుకోవడం వంటి అంశాలు నోటి క్యాన్సర్‌ను ప్రేరేపిస్తాయి. ఇలాంటివారిలో చెంపలు, నాలుక, పంటి చిగుర్లు... వంటి భాగాలను పరీక్షించి ఏ భాగంలో క్యాన్సర్ వచ్చిందో క్యాన్సర్ స్పెషలిస్టు పరీక్షించి చూస్తారు. వీళ్లలోని కొందరిలో నోటిలో వాపు కూడా రావచ్చు. అప్పుడు కూడా దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాల్సి ఉంటుంది.

మొదట సమస్య ఉన్నచోట, మెడ భాగంలోనూ సీటీ, ఎమ్మారై స్కానింగ్ వంటి పరీక్షలు చేయించి, క్యాన్సర్ వ్యాధి తీవ్రతను అంచనా వేస్తారు. ఈ పరీక్షల వల్ల పుండు పడిన చోటు నుంచి అది ఏ మేరకు వ్యాపించి ఉందో తెలుస్తుంది. అది దవడ ఎముకను చేరిందా, లేక ఎముకను దాటి మెడలోని లింఫ్ గ్రంథులకూ వ్యాపించిందా అన్న విషయాన్ని కూడా డాక్టర్లు తెలుసుకుంటారు. పేషెంట్ నోటిని మామూలుగానే తెరవగలుగుతున్నాడంటే, క్యాన్సర్ దవడ కండరాల్లోకి వ్యాపించి ఉండకపోవచ్చు. ఎందుకంటే క్యాన్సర్ దవడ కండరాల్లోకి వ్యాపిస్తే నోరు తెరవడం కష్టమవుతుంది.

నోటిలోని క్యాన్సర్ ఇతరచోట్లకు వ్యాపించకపోతే మొదట క్యాన్సర్ వచ్చిన మేరకు ఆ భాగాన్ని శస్త్రచికిత్సతో తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత... ప్లాస్టిక్ సర్జరీ లేదా రీ–కన్‌స్ట్రక్టివ్ సర్జరీ ద్వారా తొలగించిన భాగాన్ని పునర్నిర్మించవచ్చు. ఒకవేళ మెడలోని లింఫ్ గ్రంథుల్లోకి కూడా క్యాన్సర్ వ్యాపించి ఉంటే, వాటన్నింటినీ నెక్ డిసెక్షన్ ద్వారా తొలగించాల్సి ఉంటుంది. బయాప్సీ రిపోర్టు ఆధారంగా శస్త్రచికిత్స తాలూకు గాయాలు మానాక, రేడియోథెరపీ ప్లాన్ చేస్తారు.

నోటి క్యాన్సర్ అన్నది చాలా బాధాకరమైనది కావడం వల్ల గుట్కా/పొగాకు అలవాటు ఉన్నవారు వెంటనే దాన్ని మానేయాలి. ఈ అలవాటు కేవలం నోట్లోని భాగాలకే కాకుండా మెడ, ఆహారనాళం లేదా కడుపులోని ఏ భాగానికైనా క్యాన్సర్ వచ్చేలా చేయగలదన్న విషయం గుర్తుంచుకుని జాగ్రత్త పడాలి.